మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    ఎడిటర్ : నంద కిషోర్    సంపుటి : 08    సంచిక : 65    శుక్రవారం    08 - 08 - 2025    పేజీలు: 8    వెల: 4

## బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పూర్తి చేయాలి




3లో..




# నేతన్నలకు ఏటా రూ.25 వేలు

- కొత్త పథకం ప్రకటించిన సీఎం
- చేనేతలకు ఏటా నేతన్న భరోసా కింద రూ.25 వేలు ప్రకటించిన సీఎం చంద్రబాబు
- చేనేతలకు ఇప్పుడున్న సబ్సిడీలు కొనసాగిస్తూనే నేతన్న భరోసా

మన గళం, అమరావతి : చేనేతలకు ఏటా రూ .25,000 నేతన్న భరోసా పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఎన్నికల్లో హామీ ఇవ్వక పోయినా కొత్త పథకాన్ని సీఎం ప్రకటించారు. చేనేతలకు ఇప్పుడున్న సబ్సిడీలు కొనసాగిస్తూనే నేతన్న భరోసా అమలు చేయనున్నారు. చేనేతల జీవన ప్రమాణాలు పెంచటంతో పాటు వారి యంత్రాలన్నీ ఆధునికీకరిస్తామని వెల్లడించారు. చేనేతల ఆదాయం రెట్టింపు చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.

- నేతన్నలకు కొత్త పథకం
- ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రకటించిన సీఎం

చేనేతలకు ఆదాయం పెంపుపై ఆలోచన చేస్తూ వచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. చేనేత వైభవానికి పుట్టినిల్లు తెలుగునేల అని, ఆంధ్ర రాష్ట్రానికి చేనేత ఓ సంపద అని అభివర్ణించారు. చేనేతలకు తెలుగుదేశంతో అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. చేనేత దినోత్సవం సందర్భంగా 3 పథకాల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఈ నెల



నుంచే మగ్గాలకు 200 యూనిట్లకు, 500 యూనిట్లు మరమగ్గాలకు ఉచితంగా ఇస్తామన్నారు. దీనికి రూ.189.62 కోట్ల ఖర్చును సర్కారు భరించనుంది. త్రిఫ్ట్ పథకానికి 5 కోట్లు నిధులు మంజూరు చేసారు. చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ మినహాయింపు కల్పించారు. చేనేతకు ప్రత్యేక గుర్తింపు తెస్తాం: గుంటూరు జిల్లా మంగళగిరిలో జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ

2 లో..



## లోయలో పడ్డ సీఆర్పీఎఫ్ వాహనం

- జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

మన గళం డెస్క్ : జమ్మూ కశ్మీర్‌లో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం లోతైన లోయలో పడిపోవడంతో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటనలో మరో 10 మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఉధంపూర్ జిల్లాలోని బసంత్‌గఢ్ ప్రాంతంలో ఈ విషాదం జరిగింది. కొండ

2 లో..

## ఈసీపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు



- ఈసీకి వ్యతిరేకంగా అణుబాంబు లాంటి సాక్ష్యం ఉంది

మన గళం, న్యూఢిల్లీ : ఈసీకి వ్యతిరేకంగా అణుబాంబు లాంటి సాక్ష్యం ఉందంటూ లోక్‌సభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఈసీ అక్రమాలకు పాల్పడిందని.. బీజేపీ కోసం ఈసీ ఓట్లను దొంగిలించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎగ్జిట్‌పోల్స్‌కు , ఎన్నికల ఫలితాలకు చాలా తేడా ఉందని..

2 లో..




## తురకా కిషోర్‌ను తక్షణమే విడుదల చేయండి

- కిషోర్ అరెస్ట్ విషయంలో పోలీసులు చట్ట నిబంధనలు ఉల్లంఘించారని స్పష్టం చేసిన హైకోర్టు

మన గళం, అమరావతి : వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్‌ను తక్షణమే విడుదల చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అతడి విడుదలపై కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని వెల్లడించింది. కిషోర్ అరెస్ట్ విషయంలో పోలీసులు చట్ట నిబంధనలు ఉల్లంఘించారని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే మేజిస్ట్రేట్ మైండ్ అప్లై చేయలేదని ప్రాథమికంగా అభిప్రాయపడుతున్నామంటూ హైకోర్టు ధర్మాసనం కాస్తా ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ

2 లో..

## యూరియాను ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు

- వ్యవసాయేతర పరిశ్రమలకు యూరియా వినియోగించకుండా నిరోధించాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు
- కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం




మన గళం, అమరావతి : రాష్ట్రంలో పలుచోట్ల యూరియా కొరత రైతులను ఇంకా వెంటాడుతోంది. సీజన్ ఆరంభంలో విత్తిన పంటలకు యూరియా అవసరం. ఒకవైపు అధికారులు కొరత లేదంటున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. దీంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద అన్నదాతలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. పంటకు వేయడానికి అవసరం మేరకు సరకు అందుబాటులో లేదు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు యూరియా ధర పెంచి విక్రయిస్తున్నారు. సకాలంలో యూరియా వేయకపోతే పంట పెరుగుదలపై ప్రభావం పడుతుందని కర్షకులు ఎరువుల దుకాణాలవైపు పరుగులు పెడుతున్నారు. దీంతో ప్రైవేట్ వ్యాపారులు తమ వద్ద విత్తనాలు, డీఏపీ తదితర

2 లో..

## అమెరికాపైనా 50 శాతం సుంకం విధించాలి

- కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్



మన గళం, న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అమెరికా తీసుకుంటున్న ఆర్థిక చర్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత్ రష్యా నుంచి చమురు దిగుమతి చేస్తున్నదనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎగుమ తులపై 50 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించడం అన్యాయమని ఆయన విమర్శించారు. నిజానికి, చైనా భారతదేశం కంటే ఎక్కువగా రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుం

2 లో..



## చిరంజీవిపై సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు

మన గళం, హైదరాబాద్ : అగ్ర నటుడు చిరంజీవిపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో ఆరోపణలు సహజమేనని... అయితే మాట్లాడే ముందు చిరంజీవి విజ్ఞతతో మాట్లాడాలని అన్నారు. గతంలో తాను చిరంజీవి గురించి మాట్లాడానని... ఆ వ్యాఖ్యలను అప్పుడే వెనక్కి తీసుకున్నానని చెప్పారు. అయితే, ఆ వీడియోలను ఇప్పుడు వైరల్ చేస్తూ తనను బద్నాం చేయడం

2 లో..

## నిందితులు ఇంకా బయట తిరుగుతున్నారు

- పులివెందులలో జరిగుతున్న ఘటనలు చూస్తుంటే నాన్న(వివేకా) హత్య గుర్తుకు వస్తుంది
- పోలీసులను బెదిరించి క్రైమ్ సీన్‌ను తుడిచేశారు
- వైఎస్ వివేకా హత్య కేసుపై కీలక వ్యాఖ్యలు : వైఎస్ సునీత

మన గళం, కడప: వైఎస్ సునీత మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇవాళ(గురువారం) ఆమె జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ వివేకా హత్య కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత కొద్దిరోజులుగా పులివెందులలో జరిగుతున్న ఘటనలు చూస్తుంటే



## అమెరికా-భారత్ మధ్య పెరిగిన గ్యాప్



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్ కు అనుకూలంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అదనపు సుంకాలతో

2 లో..

## జమ్మూ కశ్మీర్‌లో లోయలో పడ్డ సీఆర్పీఎఫ్ వాహనం



ప్రాంతంలోని ఒక ప్రదేశానికి వెళ్తుండగా, మలుపు వద్ద డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయా డు. దీంతో వాహనం రోడ్డుపై నుంచి జారి పక్కనే ఉన్న లోతైన లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు దుర్మరణం పాలయ్యారని అధికారులు ధ్రువీకరించారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక అధికారులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని వెంటనే ప్రమాద స్థలం నుంచి బయటకు తీశారు. గాయపడిన 10 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం వారిని ఆసుపత్రికి తరలించారు. ఉధంపుర్ డిప్యూటీ కమిషనర్ అభ్యర్థన మేరకు, తీవ్రంగా గాయపడిన వారిని తరలించేందుకు ఆర్మీ హెలికాప్టర్లను రంగంలోకి దించారు. ఈ ఘటనపై స్థానిక ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "బసంత్‌గఢ్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ వాహనం ప్రమాదానికి గురైన వార్త కలచివేసింది. డిప్యూటీ కమిషనర్ సలోని రాయ్‌తో మాట్లాడాను. ఆమె స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సహాయక చర్యలు తక్షణమే ప్రారంభమయ్యాయి. స్థానికులు కూడా స్వచ్ఛందంగా సాయం చేస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్, రాజౌరి, రాంబన్, ఉధంపుర్ వంటి కొండ ప్రాంతపు జిల్లాల్లో ప్రమాదకరమైన రహదారులు, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి కారణాలతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ విభాగం అధికారులు తెలిపారు. ప్రాణాంతకమైన ప్రమాదాలను నివారించేందుకు ఈ జిల్లాల్లో ప్రత్యేక ట్రాఫిక్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు.

## ఈసీపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

మహారాష్ట్ర , హర్యానా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని తెలిపారు. ఢిల్లీలో గురువారం రాహుల్ గాంధీ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర , హర్యానా ఎన్నికల్లో పోలింగ్‌కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను మాయం చేశారని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల తరువాత భారీగా పోలింగ్ నమోదయ్యిందన్నారు. మహారాష్ట్రలో 40 లక్షల రహస్య ఓటర్లను చేర్పించారని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ డేటాను ఈసీ తమకు ఇవ్వడం లేదని.. ఓటర్ల జాబితా కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఐదు వేర్వేరు తేదీల్లో ఈసీ ఓట్లను దొంగిలించిందన్నారు. కర్నాటకలోని మహదేవ్‌పూర్‌లో కూడా ఓట్లను దొంగిలించారన్నారు. ఒకే ఓటరు పేరు నాలుగు పోలింగ్ బూత్‌ల్లో చేర్పించారని.. 11 వేల మంది పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటేశారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకే ఇంట్లో 80 మంది ఓటర్లు ఉన్నట్టు చూపించారని.. మహదేవ్‌పూర్‌లో 11965 మంది డూప్లికేట్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఒకే ఓటరు నాలుగు రాష్ట్రాల్లో ఓటేశాడని.. ఒకే ఓటరుకు కర్నాటక, మహారాష్ట్ర, యూపీలో ఓటుహక్కు ఉందని.. తెలిపారు. మహదేవ్‌పూర్‌లో లక్షా 250 ఓట్లు దొంగిలించారు.. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## అమెరికా–భారత్ మధ్య పెరిగిన గ్యాప్

భారత్ ను ఇబ్బంది పెట్టే ప్రయత్నాన్ని ఆయన చేస్తున్నారు. మరోవైపు, ఆపరేషన్ సిందూర్ తర్వాత గత జూన్ లో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా వైట్ హౌస్ లో మునీర్ కు గౌరవ మర్యాదలు లభించాయి. ఆ పర్యటన సందర్భంగా ట్రంప్ కు నోబెల్ శాంతి బహుమతికి మునీర్ మద్దతు ప్రకటించారు. తాజాగా మునీర్ మరోసారి అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రష్యా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న ఇండియాపై ట్రంప్ 50 శాతం సుంకం విధించారు. తొలుత సుంకాలను 25 శాతం పెంచిన ట్రంప్... భారత్ తన దారిలోకి రాకపోయేసరికి జరిమానాగా సుంకాలను మరో 25 శాతం పెంచారు. ఇదే సమయంలో పాకిస్థాన్ పై స్వల్ప సుంకాలను విధించారు. ఈ క్రమంలో అమెరికాతో భారత్ కు గ్యాప్ కొంత పెరిగింది. తమకు తమ దేశ ప్రయోజనాలే ప్రధానమని భారత్ స్పష్టం చేసింది. ట్రంప్ వ్యవహారశైలిపై భారత్ లో తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. ట్రంప్ పార్టీకి చెందిన కొందరు నేతలు కూడా ఆయన తీరును తప్పుబడుతున్నారు. నమ్మకమైన మిత్రదేశం భారత్ తో కయ్యం వద్దని హితవు పలుకుతున్నారు. మరోవైపు, ఇదే సమయంలో... అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి పాక్ ప్రయత్నిస్తోంది. భారత్, అమెరికా మధ్య కొంత మేర బలహీనపడ్డ బంధాన్ని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే జనరల్ మునీర్ మరోసారి అమెరికాకు వెళ్తున్నారు.

## చిరంజీవిపై సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

సరికాదని అన్నారు. ఈ విషయాన్ని చిరంజీవికే వదిలేస్తున్నానని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్లాక్ మెయిల్ రాజకీయాలు నడుస్తున్నాయని నారాయణ అన్నారు. ఏపీలో జగన్, తెలంగాణలో కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విమర్శించారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసినవే ఇప్పుడు రిపీట్ అవుతున్నాయని చెప్పారు. గతంలో జగన్ చేసిన అక్రమాలు ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని నారాయణ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బీసీలపై సడన్ గా అంత ప్రేమ ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని అన్నారు. అసలు ఏ పార్టీ తరపున ఆమె బీసీ జపం చేస్తున్నారో తెలియడం లేదని ఎద్దేవా చేశారు.

## అమెరికాపైనా 50 శాతం సుంకం విధించాలి

టుందని.. కానీ వాళ్లకు మాత్రం ట్రంప్ మినహాయింపు ఇచ్చిందని థరూర్ విమర్శించారు. భారతదేశంపై చైనా కంటే అధిక సుంకాలు విధిస్తూ అమెరికా ద్వంద్వ ప్రమాణాలను అనుసరి స్తోందని మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికాలో భారతీయ ఉత్పత్తుల కొనుగోళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం కూడా అమెరికా దిగుమతులపై ప్రతీకార చర్యలు తీసుకోవాలని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. 'మన దేశం దాదాపు 90 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. అలాంటి సమయంలో అధిక దిగుమతి సుంకాలు విధిస్తే, మన ఉత్పత్తులను కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపరు. ఎందుకు కొనుగోలు చేయాలని ఆలోచించడం ప్రారంభిస్తారు. ఇది కచ్చితంగా మన ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. చైనా రష్యా నుంచి భారత్ కన్నా ఎక్కువగా చమురు కొనుగోలు చేస్తున్నప్పటికీ.. అమెరికా ఆ దేశానికి 90 రోజుల పాటు సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చిందని.. కానీ భారతదేశానికి మాత్రం కేవలం 21 రోజుల గడువు మాత్రమే ఇచ్చిందని మండిపడ్డారు. ఇది పూర్తిగా అసమంజసమని విమర్శించారు. కేంద్రం కూడా అమెరికా దిగుమతులపై 50 శాతం సుంకం విధించడంపై ఆలోచించాలని ఎంపీ శశి థరూర్ సూచించారు. ఇతర దేశాల బెదిరింపులకు లోనవకుండా భారత్ తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఇదేనని అన్నారు. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకాలు విధించగా, తాజాగా మరో 25 శాతం పెంచి మొత్తం 50 శాతానికి తీసుకెళ్లింది. ఈ నిర్ణయాలు భారత వస్త్ర పరిశ్రమ, మత్స్య ఉత్పత్తులు, తోలు రంగాలపై తక్షణ ప్రభావం చూపించనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ స్పందిస్తూ, రైతుల ప్రయోజనాలను ఎప్పుడూ కాపాడుతామని.. ఏ స్థాయిలోనైనా తాము తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## నేతన్నలకు ఏటా రూ. 25 వేలు

సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా చేనేతలకు ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జీఎస్టీని 5 శాతం తగ్గించటం వల్ల 15 కోట్లు ఖర్చు అవుతుందని వెల్లడించారు. ప్రముఖ డిజైనర్లను సంప్రదించి వారితో చేనేతలకు మరింత అధునాతన పద్ధతిలో వస్త్రాలను తయారు చేయిస్తామన్నారు. ప్రపంచం అంతా చేనేతకు ప్రత్యేక గుర్తింపు తెస్తామని తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తామని దీనివల్ల వెంకటగిరి, మంగళగిరి, కాళహస్తి, ఉప్పాడల్లో 1374 మందికి పని కలుగుతుందని అన్నారు.

మరిన్ని కొత్త పథకాలు: అమరావతిలో హ్యాండ్ లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని స్పష్టం




చేసారు. ఆదరణ–3తో మరిన్ని కొత్త పథకాలు అందుబాటులోకి తెస్తామని వ్యాఖ్యానించారు. మంగళగిరిలో ఇప్పటి వరకు టీడీపీ గెలిచింది ఒక్కసారి మాత్రమేనని లోకేశ్?కు వద్దని వారించినా, ఓడిన చోటనే గెలవాలని నిర్ణయించుకుని వచ్చి ఘన విజయం సాధించారని గుర్తు చేసారు. 5,000 ఓట్ల తేడాతో ఓడిపోయిన లోకేశ్ 90,000తో గెలవడం ఆనందంగా ఉందని తెలిపారు. 3,000 కుటుంబాలకు బట్టలు పెట్టి పట్టాలు అందించిన ఘనత లోకేశ్ దని అన్నారు. మంగళగిరిని రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని లోకేశ్ నిర్ణయించారని వెల్లడించారు. స్వర్ణకారుల కార్పొరేషన్ పెట్టి ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చేశారని అన్నారు.

## తురకా కిషోర్‌ను తక్షణమే విడుదల చేయండి

నేపథ్యంలోనే తురకా కిషోర్ విడుదలకు ఆదేశాలు ఇస్తున్నామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది. మరోవైపు తురకా కిషోర్‌కు ఇటీవల అన్ని కేసుల్లో బెయిల్ లభించింది. దీంతో గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. అయితే ఆ వెంటనే మరో కేసులో అతడిని రెంటచింతల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కిషోర్‌ను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారంటూ పోలీస్ వాహనం ఎదుట తురకా కిషోర్ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో వారిని పక్కకు నెట్టి.. తురకా కిషోర్‌ను రెంటచింతల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతడిని జైలుకు తరలించారు. కిషోర్‌పై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా టీడీపీకి చెందిన పలువురు నేతలు మాచర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా వారి వాహనంపై తురకా కిషోర్ కర్రతో దాడి చేశారు. అనంతరం అతడిపై పలు కేసులు నమోదవుతున్నాయి. దీంతో గత కొద్ది నెలలుగా అతడు జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

## యూరియాను ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు

ఎరువులు కొనుగోలు చేసిన వారికి మాత్రమే యూరియాను విక్రయిస్తున్నారు. ఏదో ఒక లింకుతో లేదా ఎక్కువ ధరకు విక్రయాలు జరుపుతున్నారు. మార్కెట్‌లో యూరియా కొనుగోలు చేయాలంటే తలకు మించిన భారంగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ డీలర్లు రేట్లు పెంచేయడంతో తమకు ఇబ్బందిగా మారిందని చెప్పుకొస్తున్నారు. రాయితీ ద్వారా వీటిని అందించాలని కోరుతున్నారు. కర్షకులకు ఇబ్బందులు లేకుండా ఎరువుల సరఫరా చేస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. యూరియా కొరత లేదని అన్నదాతలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు. నానో యూరియా కూడా అందుబాటులో ఉందని దానిని వినియోగించుకోవచ్చని సూచిస్తున్నారు. అయితే రాష్ట్రానికి కేటాయించిన యూరియాను ఇతర అవసరాలకు వినియోగించడం కూడా కొరతకు కారణమని తెలుస్తోంది. దీనిపై సర్కార్ దృష్టి సారించింది. ఈ క్రమంలో యూరియాను వ్యవసాయేతర పరిశ్రమల అవసరాలకు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు తగుచర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. రాష్ట్రాలకు కేటాయించిన యూరియాను వ్యవసాయేతర పరిశ్రమల అవసరాలకు మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం గట్టిగా ఆదేశించింది. ఈ పరిస్థితుల్లో ఈ మేరకు ఏపీ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన వ్యవసాయ ముఖ్య కార్యదర్శి, ఇతర ముఖ్య కార్యదర్శులు, శాఖాధిపతులతో త్వరలో అత్యున్నత సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భేటీలో మార్గదర్శకాలు రూపొందించి జారీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పరిశ్రమలు, ఎక్సైజ్, రవాణా, లేబర్, ఫ్యాక్టరీలు, మత్స్య, పౌరసరఫరా, పశు సంవర్ధక శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మరియు ఇతర శాఖలకు ఇప్పటికే ప్రాథమిక సమాచారం పంపినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు.

## నిందితులు ఇంకా బయట తిరుగుతున్నారు

నాన్న(వివేకా) హత్య గుర్తుకు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్న గొడ్డలిపోటుతో పడిఉంటే.. గుండెపోటు అని చెప్పారని సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను బెదిరించి క్రైమ్ సీన్‌ను తుడిచేశారని ఆరోపించారు. హత్య తరువాత కొందరు వ్యక్తులు లెటర్ తీసుకువచ్చి ఆదినారాయణ రెడ్డి, సతీష్ రెడ్డి, బిటెక్ రవిలు హత్య చేసినట్లుగా తనని సంతకం పెట్టామన్నారని తెలిపారు. తాను ఎంత బలవంతం చేసినా సంతకం పెట్టలేదని స్పష్టం చేశారు.అప్పుడు వైఎస్ అవినాష్ రెడ్డి అనుచరులు పోలీసులను బెదిరించారని ఆరోపించారు. నాన్న(వివేకా)ను టీడీపీ నేతలు చంపారని నమ్మబలికారని తెలిపారు.

తమ బంధువు సురేష్ అనే వ్యక్తిపై దాడి జరిగిందని సునీత ఆవేదన వ్యక్తం చేశారు. అతనిపై ఎంపీ అవినాష్ అనుచరులు దాడి చేయించారన్న అనుమానం ఉందని పేర్కొన్నారు. గత 6 ఏళ్ళుగా కేసుపై పోరాడుతూనే ఉన్నామని తెలిపారు. ఇంత వరకు దోషులకు శిక్ష పడలేదని అసహనం వ్యక్తం చేశారు. నాన్న(వివేకా)ను హత్య తాను, రాజశేఖర్ రెడ్డి కలిసి చేయించారని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాలని డిమాండ్ చేశారు. హత్య కేసు నిందితులు బయట తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**– రేపు నాన్న(వివేకా) పుట్టినరోజు..**

రేపు నాన్న(వివేకా) పుట్టినరోజు అని సునీత గుర్తు చేశారు. కానీ తనని తన తల్లి పులివెందులకు రావద్దని చెప్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోసం పోరాడడానికి సెక్యూరిటీ పెట్టుకుని తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పుకొచ్చారు. ఏ రోజైనా కచ్చితంగా న్యాయం గెలుస్తుందని నమ్ముతున్నాని ధీమా వ్యక్తం చేశారు. తన మీద, తన భర్త మీద కేసులు పెడుతున్నారని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టిన, బెదిరించిన భయపడే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని సునీత స్పష్టం చేస్తున్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతి..

మన గళం డెస్క్ : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం నగరంలోని ఫిషింగ్ హార్బర్ ఏరియాలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఫిషింగ్ హార్బర్ ఏరియాలోని హిమాలయ బార్ దగ్గర గురువారం సాయంత్రం ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ప్రజల సహకారంతోనే ట్రాఫిక్ నియంత్రణ

**– రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే 7777877722 నెంబర్ కు ఫోటోలు, వీడియోలు పంపండి**
**– "నేను ట్రాఫిక్ మిత్ర" కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**




మనగళం, కర్నూలు క్రైం : ప్రజల సహకారంతోనే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమని, ఆటో డ్రైవర్లు, యువత ప్రతఒక్కరూ పోలీసులకు సహకారం అందజేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పిలుపునిచ్చారు. కర్నూల్ ట్రాఫిక్ విభాగం పోలీసుల ఆధ్వర్యంలో గురువారం కొండారెడ్డి బురుజు దగ్గర "నేను ట్రాఫిక్ మిత్ర "కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ "నేను ట్రాఫిక్ మిత్ర " పోస్టర్లతోపాటు డ్రోన్, సీసీ కెమెరాలను ఆవిష్కరించారు. దాతలకు జిల్లా ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలను, ఆటో డ్రైవర్లను పోలీసు సేవలలో భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలకు మేలుచేసే విషయంలో ప్రతి ఒక్క పౌరుడు పోలీసే అని ఎస్పీ పేర్కొన్నారు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ , రాంగ్ పార్కింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడుపుట, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఏక్కడైనా కళ్ళముందు వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినట్లయితే ఫోటోలు , విడియోలు కర్నూలు పోలీసు వాట్సాప్ గవర్నెన్స్ సెల్ 7777877722 నెంబర్ కు చేరవేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ మనందరి భాద్యత, ఫొటోలు, వీడియోలు అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కర్నూలు పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్దీకరణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. త్వరలో రవాణా శాఖ, ఎపీయస్ ఆర్టీసీ , మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమై ట్రాఫిక్ నియంత్రణకు సహకారం తీసుకుంటామని చెప్పారు. ట్రాఫిక్ పోలీసుస్టేషన్ కి ఒక డ్రోన్ కెమెరాను కూడా మంజూరు చేశామని, ఎక్కడైనా ట్రాఫిక్ అంతరాయం కలిగినట్లయితే ఆ డ్రోన్ కెమెరాతో గుర్తించి ట్రాఫిక్ ని , క్రౌడ్ కంట్రోల్ ను క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

ఆటో, స్కూల్ బస్సుల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహిరించాలని, ట్రాఫిక్ నియంత్రణకు సహకారం అందజేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. నేను ట్రాఫిక్ మిత్ర కార్యక్రమం అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లకు ఎస్పీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఆటో రోడ్డు ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఇబ్బందులకు గురవుతుందనే విషయాన్ని గుర్తించి మెలగాన్నారు. డ్రైవింగ్ లైసెన్సులతో పాటు ఆటో నడిపే వారు ఖచ్చితంగా ఖాకీ యునిఫాం ధరించాలన్నారు. ఎక్కడైనా అనుమానస్పద వ్యక్తులు కనపడితే నేర నివారణకు ముందస్తు సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. ఆ విధంగా సమాచారం అందిస్తే 50 నుండి 60 శాతం క్రైమ్ రేట్ తగ్గుతుందన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు , సమస్యలు ఉంటే ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తేవాలని సూచించారు. కర్నూలు డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ శాంతకుమారి మాట్లాడుతూ ప్రజలకు, ట్రాఫిక్ కు అంతరాయం కలిగించకుండా ఆటోడ్రైవర్లు మెలగాలని చెప్పారు. ఎక్కడపడితే అక్కడే రోడ్డు మధ్యలో ఆపడం వలన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ ఇన్సూరెన్స్ (బీమా) కలిగి ఉండాలన్నారు. సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ , ప్రతి వాహనానికి పోల్యూషన్ సర్టిఫికేట్ వ్యాలిడిటీ ఉంటనే ఇన్సూరెన్సు క్లయిమ్ వర్తిస్తుందన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆటో డ్రైవర్లకు ఖాకీ యూనిఫాం లను అందజేశారు . కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ , కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ఆర్ టీ ఓ లు భరత్ చవాన్, ఎమ్ వీ ఐ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చేనేతల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

**– నేతన్నల్లో ఆనందం..ఎంపీ బస్తిపాటి నాగరాజు**



మనగళం, కర్నూలు సిటీ : చేనేతల అభివృద్ధి కి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో పాల్గొంటున్న ఆయన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఒక ప్రకటన ద్వారా నేతన్నలకు శు భాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా అందించ నుందన్నారు. అలాగే చేనేత వస్త్రాల పై కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న 5శాతం జీఎస్టీ ని రాష్ట్ర ప్రభుత్వమే భరించడం తో పాటు, కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ కింద ఏడాదికి రూ.5 కోట్లు చొప్పున విడుదల చేయనుందన్నారు. నేతన్నల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న పథకాల ద్వారా కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎంపీ నాగరాజు తెలిపారు.

# కేబినెట్ నిర్ణయాలపై హర్షం




మనగళం, కర్నూలు సిటీ : మంత్రివర్గ సమావేశంలో సీఎం నారా చంద్రబాబునాయుడు చేనేతలకు, నాయీ బ్రాహ్మణులకు రాయితీలు ప్రకటించటంపై కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకారు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, కె.నాగేంద్రకుమార్, మాదిక కార్పొరేషన్ డైరెక్టర్ దరూర్ జేమ్స్, టీ.యన్.యస్.యఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిపోగు బజరాన్న, జిల్లా ప్రధానకార్యదర్శి బొగ్గుల ప్రవీణ్ తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే సీఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలులోకి తీసుకొని వచ్చారని, జూన్ 12న తల్లికి వందనం క్రింద చదువుకునే విధ్యార్థి తల్లి భ్యాంకు కాతాలో రూ.13,000లు జమ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 2న రైతాంగానికి అన్నదాత సుఖీభవ పథక కింద రైతుల భ్యాంక్ కాతాలో రూ. రూ. 7 వేలు జమచేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం క్యాబినెట్ నిర్ణయం మేరకు చేనేతల మగ్గాలకు 200 యూనిట్లు, పవర్లూమ్స్ 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇవ్వడమేకాక, జి.యస్.టి.ని కూడా ప్రభుత్వమే చెల్లించేందుకు నిర్యయం తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే నాయీ బ్రాహ్మణులు ఉపయోగించే సెలూన్సు 200 యూనిట్ల మేరకు ఉచిత విద్యుత్ అందజేసేందుకు నిర్ణయం జరిగిందని వివరించారు. అదేవిధంగా ఆగస్టు 15 నుండి ఆర్.టీ.సీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణానికి నాంది పలుకబోతున్నామని సంతోషం వ్యక్తం చేశారు.

# పారిశ్రామికవేత్తలు మార్గదర్శకులు కావాలి



**– నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ విజ్ఞాపన**

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : పారిశ్రామిక వేత్తలు పేద ప్రజల అభ్యున్నతికి సహకారం అందించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. బుధవారం కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏపీఐఐసీ కార్యాలయం వద్ద పారిశ్రామిక వేత్తలతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం రూపొందించిన పీ4 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుపరిచేందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు. అన్ని రంగాల్లో ముందున్న సంపన్నులు పీ4 కార్యక్రమంలో మార్గదర్శకులుగా నమోదు చేసుకుని, వెనుకబడిన కుటుంబాలకు చేయూత నివ్వాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, నోడల్ అధికారులు వాజిద్, మన్సూర్, సుహైల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పూర్తి చేయాలి




**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా నియోజకవర్గ, మండల స్పెషల్ అధికారులను, ఎంపీడీఓ లను ఆదేశించారు. గురువారం ఉదయం పీ4 అంశంపై జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మండలాల్లో పీ4 కింద పెండింగ్ లో ఉన్న బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను రెండు రోజులలోపు పూర్తి చేయాలన్నారు. కర్నూలు రూరల్, కోడుమూరు రూరల్, మంత్రాలయం, కర్నూలు అర్బన్, పాణ్యం, ఓర్వకల్లు, పత్తికొండ, కృష్ణగిరి, మద్దికెర, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లో ఎక్కువ పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డివిజన్ ల వారీగా సాధించిన పురోగతి గురించి ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ ఆర్డీఓ లతో సమీక్షించారు. ఒకవేళ ఏమైనా టెక్నికల్ సమస్యలు ఉంటే సిపిఓ కార్యాలయంతో కో ఆర్డినేట్ చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. బంగారు కుటుంబాలకు ఏమేమి అవసరాలు ఉన్నాయనే విషయాలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి ఆగస్టు 15 వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, అప్పటిలోపు నీడ్ అసెస్మెంట్ సర్వే ప్రక్రియ కూడా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, సీపీఓ హిమ ప్రభాకర్ రాజు, హౌసింగ్ పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# అదనపు పోలింగ్ కేంద్రాలపై అభిప్రాయాలు తెలుపండి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద అదనంగా మరో 60 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూపొందించిన ప్రతిపాదనలపై తమ అభిప్రాయాలను తెలుపాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులను సూచనలిస్తే పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. ఓటర్ల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

# టీసీఎస్ ఉద్యోగుల వేతనాలు పెంపు

మనగళం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వచ్చేనెల 1 నుంచి అమలులోకి వచ్చేలా 80% సిబ్బంది వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంతో ప్రధానంగా జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఈ ఏడాది 12,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు టీసీఎస్ ఈ మధ్యనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో కంపెనీ జీతాలను పెంచడం గమనార్హం.

# జగన్ జైలుకు వెళ్లే రోజు దగ్గరలోనే ఉంది

**– రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు**



మనగళం, కర్నూలు సిటీ : అధికారం కోల్పోయిన వై.ఎస్.జగన్ రెడ్డి విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నాడని, ఏ జిల్లాలో పర్యటించిన ఆయా జిల్లాలోని నాయకులను, ప్రజలను రెచ్చగొట్టేల మాట్లాడుతున్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజల సొమ్మును అడ్డంగా దోచుకున్నారని, మాజీ సీఎం జగన్ జైలుకు వెళ్లే రోజు దగ్గరలోనే ఉందన్నారు. గురువారం సోమిశెట్టి విలేకరులతో మాట్లాడుతూ గత 5 సంవత్సరాలు పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్లు జగన్ రెడ్డికి ప్రభుత్వ పగ్గాలు ఇచ్చినట్లుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. పిచ్చోడి చేతికి రాయి ఇస్తే ఏమి చేస్తాడో ప్రజలందరికి తెలుసనని, అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని ఆరోపించారు. మాజీ సీఎం గత ఐదేళ్లు రాజారెడ్డి రాజ్యాంగం నడిపి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తూ ప్రజల ఆస్తులను అక్రమంగా దోచేశావని అన్నారు. జగన్ పై రూ. 44 వేల కోట్ల ఈ.డి అటాచ్మెంట్ ఉందని, జైలులో చిప్పకూడు తిని బేయిల్ పై బయట ఉన్నారని, ఎప్పుడైనా జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. రూ. 3,500 కోట్ల లిక్కర్ స్కాంలో అరెస్టు అయి జైలులో ఉన్న అవినాష్ రెడ్డిని జైలుకు వెళ్లి తన పేరు బయట చెప్పొద్దని జగన్ వేడుకు న్నాడని ఆరోపించారు.

# సీపీఐ కర్నూలు జిల్లా మహాసభలకు తరలి రండి

మనగళం, కర్నూలు సిటీ : రాయలసీమ సమగ్రాభివృద్ధికి రూ. 20వేల కోట్లు కేటాయించాలని, జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలని పోరాడే సీపీఐ 24 వ జిల్లా మహాసభలకు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య పిలుపునిచ్చారు . గురువారం సీఆర్ భవన్ లో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి గిడ్డయ్య మాట్లాడుతూ కర్నూలు నగరంలో ఆగస్టు 9,10,11 తేదీల్లో సీపీఐ కర్నూలు జిల్లా మహాసభలు ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల సందర్భంగా 9వ తేది 11గంటలకు జిల్లా పరిషత్ నుండి పాతబస్టాండ్ వరకు మహాప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య, డి జగదీష్ , ప్రసంగిస్తారన్నారు. అదేవిధంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె రామాంజనేయులు, ఆవుల శేఖర్, నక్కి లెనిన్ బాబు పాల్గొంటారన్నారు. అనంతరం పున్నమి ఫంక్షన్ హాల్ ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల ఆహ్వాన




నేడు అదికారంలోకి వచ్చిన తరువాత నిధులు కేటాయించడంలో వివక్ష చూపుతున్నారని విమర్శించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు మనోహర్మాణిక్యం, నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రుచి వేదిక రెస్టారెంట్ ప్రారంభం

మనగళం, కర్నూలు సిటీ: కర్నూలు పట్టణం,బళ్ళారి చౌరస్తా నందు నూతన రుచి వేదిక రెస్టారెంట్, బ్యాంకెట్ హాల్ ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారిని పుష్పగుచ్ఛం అందించి రుచి వేదిక యజమానులు ఘన స్వాగతం పలికారు.



## మాణిక్కం ఠాగూర్ ను కలిసిన నాగమధు యాదవ్



మనగళం, కర్నూలు సిటీ : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్, తమిళనాడు పార్లమెంట్ సభ్యులు మాణిక్యం ఠాగూర్ ను గురువారం దేశ రాజధాని ఢిల్లీలోని తన కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగమధు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించారు. యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేసి, దేశంలో ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య యువత ప్రజా సమస్యల పరిష్కారానికై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు నిర్వహించాలని సూచించారు.


## దేశ భక్తి ప్రతిబింబించేలా తిరంగా కార్యక్రమాలు

– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : దేశ భక్తిని ప్రతిబింబించేలా తిరంగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల ప్రచార పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటి పై మువ్వన్నెల జండా) కార్యక్రమాలను జిల్లాలో నిర్వహించడం జరుగుతోందన్నారు. భారత దేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబించే విధంగా ఆగష్టు 15 వ తేదీ వరకు గ్రామ పంచాయతీ స్థాయి నుంచి దేశ రాజధాని వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి భారతీయుడు తమ ఇళ్లలోకి జాతీయ జెండాను తీసుకువచ్చి గర్వంగా ఎగురవేసి వారి లో దేశ భక్తి పెంపొందించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో భాగంగా తిరంగా ప్రదర్శనలు, రంగోలి పోటీలు, తిరంగా రాఖి తయారీ, వర్క్షాప్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ డా. కె వేణుగోపాల్, జడ్పీ సీఈఓ నాసర రెడ్డి, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు పాల్గొన్నారు.

## వడ్డీరేట్లు యథాతథం.. ఆర్బీఐ కీలక ప్రకటన




మన గళం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో వడ్డీరేట్లను యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 5.5 శాతం రెపోరేటు కొనసాగుతుందని ప్రకటించారు. 2025లో ఇప్పటికే వడ్డీరేట్లపై ట్రిబుల్ బొనాంజా ప్రకటించిన ఆర్బీఐ, ఈసారి మాత్రం ఆచితూచి వ్యవహరించింది. ద్రవ్య విధానంలో 'న్యూట్రల్' వైఖరి కొనసాగుతుందని స్పష్టం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు 6.5శాతంగా నమోదవ్వొచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన విషయం తెలిసిందే. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది.

# వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి సహకరించండి

మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయలకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం (ఏపీవీబీఎస్) రాష్ట్ర అధ్యక్షులు, అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ ... ఎంపీ లను, వివిధ పార్టీల అధ్యక్షులను, ముఖ్య నాయకులను కోరారు. ఢిల్లీ లో ఎంపీలు, నాయకుల నివాసంలో మర్యాదపూర్వకంగా సమస్యను క్రాంతి నాయుడు బోయ వివరించారు. ఆంధ్రా రాష్ట్రంలో అత్యంత మోసపోయింది వాల్మీకి బోయ జాతి అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వ సమయంలో గవర్నర్ ప్రసంగం, మద్దతుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సత్యపాల్ కమిటీ రిపోర్ట్, ఎపి ఎస్సీ, ఎస్టీ కమిషన్ కారెం శివాజీ నివేదికల ఆధారంగా తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2023 లో వన్ మ్యాన్ కమిషన్, ఎస్టీ కమిషన్ రిపోర్ట్స్ తో ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. ఆ తరువాత కేంద్రం కొన్ని కామెంట్స్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి రెండు సార్లు వెనక్కు పంపడంతో సమస్య అలానే ఉంది అని ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ లోని వాల్మీకి బోయలు షెడ్యూల్డ్ తెగగా గుర్తించడానికి కేంద్రం నిర్ణయించినా, కావాల్సిన సామాజిక లక్షణాలను, నిర్ణయించే ప్రమాణాలను పూర్తిగా సంతృప్తి పరుస్తారు అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కమిషన్లు చెబుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలిపినా కానీ కేంద్రంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఓఆర్జిఐ), గిరజన శాఖ కమిషన్(ఎస్సీఎస్టి) ఏదో ఒక విచారణ పెట్టి ఈ ప్రక్రియను ఆపుతున్నారు అని తెలిపారు. తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి వివరణ పంపాలి అని ఇప్పటికీ 10 ఏళ్ల కాల యాపన చేశారని, రాజ్యాంగ ఉల్లంఘన జరిగి మోసపోయిన వాల్మీకి బోయలకు తప్పకుండా న్యాయం చేయాలని విన్నవించారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో



ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నందుకు చొరవ తీసుకుని పార్లమెంట్ సాక్షిగా లోక్ సభ, రాజ్య సభ లో గళం వినిపించాలి అని నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధ్యక్షులు శరద్ పవార్ ను, జాతీయ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి ముకుల్ వాస్నిక్ ను, మాణిక్యం ఠాగూర్ ను, కిషోరీ లాల్ శర్మ ను, మాజీ మంత్రి దీపా దశమున్షిని, గుర్దీప్ సప్పల్ ను, ఇండియా బ్లాక్ ఫ్లోర్ లీడర్లను ఆర్జేడీ, టీఎంసీ, డీఎంకే తదితర పార్టీల నాయకులను పార్లమెంట్ లో కలిసి సమస్య వివరించి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవీబీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు వాల్మీకి అర్జున్, అనంతపురం జిల్లా అధ్యక్షులు మాధవయ్య, ప్రధాన కార్యదర్శి తలారి ఆదినారాయణ, గౌరవ అధ్యక్షులు అంకె రామలింగమయ్య, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఆలూరు యువజన విభాగం అధ్యక్షుడు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# 8న సామూహిక వరలక్ష్మీ వ్రతములు

మనగళం శ్రీశైలం : ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా దేవస్థానం తేది 08.08.2025 ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తోంది. అదే విధంగా శ్రావణ అయిదవ శుక్రవారం (22.08.2025) రోజున కూడా ఈ సామూహిక వ్రతాలను నిర్వహిస్తోంది. రేపు( 08.08.2025) జరగనున్న ఈ సామూహికవ్రతంలో 1600 మంది ముత్తైదువులకు అవకాశం కల్పించబడుతోంది. వీటిలో 500 టోకెన్లను గతవారంలోనే ఆన్లైన్ నందు ఉంచడం జరిగింది. తక్కిన వాటిని మ్యానువల్ విధానంలో ప్రజాసంబంధాల విభాగం ద్వారా అందివ్వడం జరిగింది. కాగా అయిదవ శుక్రవారం రోజున 750 మంది పైగా చెంచు ముత్తైదువులకు, 750 మందిదాకా ఇతర భక్తులకు అవకాశం కల్పించబడింది. ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రపతి కల్యాణమండపంలో ఈ వ్రతాలు నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తులలో మన సనాతన ధర్మంపై అవగాహన కల్పించి, వారిలో ధార్మిక చింతనను పెంపొందించేందుకు ఈ వ్రతాలు నిర్వహించదుతున్నాయని అన్నారు. కాగా ధర్మప్రచార కార్యక్రమములో భాగంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతంలో పూజాద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూరుస్తుందన్నారు. వ్రత కార్యక్రమంలో పాల్గొనే ప్రతీ ముత్తైదువ కోసం వేర్వేరు కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా ఈ వ్రతం జరిపించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వ్రతాన్ని జరిపించుకునే ముత్తైదువులకు అమ్మవారి శేషవస్త్రాలుగా చీర, రవికవస్త్రం, పూలు, గాజులు, లడ్డు ప్రసాదం, పుస్తక ప్రసాదంగా శ్రీశైలప్రభ, వృక్ష ప్రసాదంగా తులసి, ఉసిరి మొదలైన దేవతా మొక్కలను ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్రతానంతరం ముత్తైదువులందరికీ వారు ధరించేందుకు వీలుగా శ్రీస్వామిఅమ్మవార్ల కైలాస కంకణాలు కూడా అందజేయబడుతుందని తెలిపారు. వ్రతానంతరం ముత్తైదువులందరికీ శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించబడుతుందన్నారు. దర్శనానంతరం దేవస్థానం అన్నపూర్ణభవనం నందు భోజన సదుపాయం కూడా కల్పించబడుతుందన్నారు.



# కోడుమూరు మండలంలో ఏకగ్రీవంగా ఎమ్మార్పీఎస్

# నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలో నూతన ఎమ్మార్పీఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోడుమూరు మండల పరిధిలోని వరప్ప కాంప్లెక్స్ పాత స్టేట్ బ్యాంకు లో. ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య మాదిగ, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు సుభాష్ మాదిగ ఎం ఎస్ పి నాయకులు కప్పట్రాళ్ల లక్ష్మన్న, కే. రాజు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఎమ్మార్పీఎస్ కోడుమూరు మండల అధ్యక్షులుగా మరొక్కసారి ఏకగ్రీవంగా సపోగు నాగేష్ మాదిగను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి నాయకులుగా గోరంట్ల పి వెంకట రాముడు కూడా ఎన్నుకోవడం జరిగింది. రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య మాదిగ, సుభాష్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అనుబంధ



సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది నూతన కమిటీలో నూతన సభ్యులు సపోగు మోషన్న బొమ్మసాని సందేశ్, ముడుమలకుర్తి గిరి, కిష్టాపురం లాలు గోరంట్ల అయ్యన్న ముడుమలగుర్తి రత్నం రాముడు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తమ ఎంపికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని అభినవ అంబేద్కర్ మందకృష్ణ మాదిగ అడుగుజాడలలో రాష్ట్ర, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మాదిగ జాతి అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామని ప్రమాణం చేశారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

చేనేతపై చిన్నచూపు

తెలంగాణ ఉద్యమంలో చేనేత వర్గం కీలకంగా పనిచేసింది. గ్రామీణ జీవన విధానంలో వ్యవసాయరంగం తర్వాత ప్రధానమైన జీవనోపాధిగా చేనేత వెలుగొందుతున్నది. తెలంగాణ అస్తిత్వంలో పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట, దుబ్బాక, వరంగల్, కరీంనగర్ చేనేత వస్త్రాలు విడదీయలేని అనుబంధాన్ని కలిగి ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం చేనేత రంగాన్ని ఒక ప్రధాన ఆర్థిక వ్యవస్థగా గుర్తించి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసింది. చేనేత శాఖను కేటీఆర్ సమర్థవంతంగా నిర్వహించి చేనేత మరమగ్గాల రంగాల రెండింటిని అభివృద్ధి పరిచారు. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు రంగాలను పూర్తిగా విస్మరించి చేనేత కార్మికుల ప్రయోజనాలను కాలరాస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు మించి ఒక పథకం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తదాన్ని తీసుకురాలేదు. చేనేత కార్మికులకు రుణమాఫీ రూ.లక్ష వరకు చేస్తామని చెప్పి నేటికీ అమలుచేయని దుస్థితి. నూలు సబ్సిడీ స్థానంలో చేనేత కార్మిక కుటుంబాలకు ఏటా రూ.24 వేల చొప్పున ఇస్తామని ప్రకటించినప్పటికీ నేటికీ అమలుకు నోచుకోలేదు. ఈ పథకం ప్రతిపాదనలు గత ప్రభుత్వంలోనివే. చేనేత కార్మికుల త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని మూడేండ్ల కాలవ్యవధి నుంచి రెండేండ్లకు కుదించారు. గత ప్రభుత్వంలో విడుదల చేసిన త్రిఫ్ట్ ఫండ్ పథకంలోని నిధులను తాము విడుదల చేసినట్టుగా చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లింది. చేనేత దినోత్సవ సందర్భంగా నిపుణులైన చేనేత కార్మికులకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతో అవార్డులను ప్రవేశపెట్టింది గత కేసీఆర్ ప్రభుత్వం.

పద్మశాలి సమాజం కోసం కోకాపేటలో రెండున్నర ఎకరాలు, ఆత్మగౌరవ భవనం కోసం రూ.5 కోట్లను గత కేసీఆర్ ప్రభుత్వం కేటాయించింది. నేటికీ ఈ భవనం నిర్మాణం మొదలు కాలేదు. శాసనసభ, శాసనమండలిలలో టీఆర్ఎస్ పక్షాన చేనేత వర్గానికి చెందిన వ్యక్తులు ఇద్దరు సభ్యులుగా ఉన్నారు. సామాజిక న్యాయం మాట్లాడే కాంగ్రెస్ పార్టీ పద్మశాలి సమాజానికి ఏ విధమైన ప్రాతినిధ్యం కల్పించలేదు. అవకాశం ఉన్న చేనేత మరమగ్గాల కార్పొరేషన్లకు కనీసం చైర్మన్లను కూడా నియమించలేదు. అట్టహాసంగా పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించి ఏడాది కావస్తున్నా నేటికీ నిధులను కేటాయించలేదు. సరి కదా చైర్మన్ నియామకం కూడా జరగలేదు.

ఇదంతా చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం నోటి మాటలతోనే సానుభూతిని చూపిస్తుంది తప్ప చేనేత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదు. ఇక ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని, టెస్కోకు పాలక మండలి ఎన్నికలు నిర్వహిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఏమైందో చేనేత మంత్రి చెప్పాలి. ప్రాథమిక చేనేత సహకార సంఘాల నుంచి నేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలను కొనుగోలు చేయడంలో టెస్కో పూర్తిగా విఫలమైంది. చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలలో కనీసం 50 శాతం ప్రభుత్వం కొనుగోలు చేసి వారి ఉపాధికి

భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఇదిలా ఉంటే సిరిసిల్లను ఉరిసిల్లగా మారుస్తున్నది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం. గత ప్రభుత్వం ఆత్మహత్యలకు నిలయమైన సిరిసిల్ల మరమగ్గాల రంగాన్ని పునర్నిర్మించి అభివృద్ధిపరిచేందుకు అనేక పథకాలను అమలుచేసింది. ఆత్మహత్యలు లేని సిరిసిల్లగా తీర్చిదిద్దింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతోమంది నేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు.

బతుకమ్మ చీరలు ఆర్డర్ ఇవ్వడంలో ఆలస్యం చేయడం వల్ల అనేకమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. మరమగ్గాల రంగానికి సబ్సిడీతో కూడిన విద్యుత్తు సరఫరా ఆపివేయడంతో నేడు సిరిసిల్లలో సగానికి పైగా మరమగ్గాలు పనిచేయడంలేదు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రవేశపెట్టి రూ.వందల కోట్ల నిధులతో షెడ్లు నిర్మించింది గత ప్రభుత్వం. ఈ పథకాన్ని అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారన్న ఒకే ఒక కారణంతో సిరిసిల్లలో చేనేత కార్మికుల మీద కక్ష తీర్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకున్నది.

తనను గెలిపించలేదని అక్కడి కాంగ్రెస్ ఇంచార్జ్ మరమగ్గాల రంగం అభివృద్ధి కోసం ఏ ఒక్క పథకం ప్రవేశపెట్టకుండా అడ్డుపడుతున్నారు. నేడు సిరిసిల్లలో ఉపాధి లేక చేనేత కార్మికులు తిరిగి మహారాష్ట్రకు, గుజరాత్‌కు వలసలు పోయే పరిస్థితి దాపురించింది. నిజంగా చేనేత కార్మికుల మీద చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి సిరిసిల్ల నేత కార్మికుల సమస్యల మీద హౌజ్ కమిటీని ఏర్పాటుచేసి పరిష్కరించాలి.


## శ్రావణ మాసంశనివారం గుమ్మకోండ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



మన గళండోన్ శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే శ్రీరామ జయ రామ జయ జయ రామ భక్తజనులకు విజ్ఞప్తి... దర్శించండి తరించండి... యక్షులు ప్రతినిత్యం స్వామి వారిని పూజిస్తూ ప్రత్యక్షంగా తపమాచరిస్తున్న మహోన్నతమైన, ఎంతో మహిమాన్వితమైన క్షేత్రం.. సంతాన వరదుడు, కోరికలు తీర్చుకొంగు బంగారం, సమస్త రోగ ప్రసమానార్థం, ఆయురారోగ్య ఐశ్వర్య అభివృద్ధి దాత, భూతప్రేతాధికముల నుండి విముక్తి కలిగించే అసాధ్యసాధక, అంజనీపుత్ర పవనసుత నామ, రామభక్త శివ స్వరూప, శ్రీశ్రీశ్రీ బంగారుకొండ పాత పాలెం అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు.. శ్రీ విశ్వ వాసు సంవత్సరం, దక్షణాయనం , వర్ష ఋతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం, శనివారం, 09-08-2025, శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు.. డోన్ మండలం గుమ్మకొండ గ్రామం కొండలలో వెలసిన వ్యాసరాయ ప్రతిష్టా మూర్త శ్రీశ్రీశ్రీ బంగారుకొండ పాతపాలెం అభయాంజనేయ స్వామి వారికి శ్రావణ పౌర్ణమి మూడవ శనివారం సందర్భంగా, 09-08-2025, శనివారం, ప్రాతఃకాల పూజలు ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకాలు, తమలపాకు తోరణాభిషేకాలు, సింధూర కుంకుమార్చనలు, నైవేద్య సమర్పణ, తీర్థ ప్రసాద వినియోగం జరుగును.. తదుపరి మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి మహా నైవేద్య సమర్పణ , మహా మంగళహారతి సమర్పణ కార్యక్రమాలు జరుగును. తదుపరి తీర్థ ప్రసాదములు భక్తులకు ఇవ్వబడును, స్వామివారి అభయరక్షలు ఇవ్వబడును.. ఆడపడుచులకు పసుపు కుంకుమ గాజులు ఇవ్వబడును... దేవాలయం దగ్గర ఉదయం 10 గంటలనుండి నుండి

నంది అవార్డు గ్రహీతల భక్తి గీతాలాపనలు, భజన కార్యక్రమం సాయంకాలం వరకు జరుగును, సాయంకాలం 6 గంటల నుండి స్వామివారి గ్రామోత్సవం జరుగును.. కావున భక్తులందరూ స్వామి వారిని దర్శనం చేసుకుని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ ధర్మ కర్త పూజారి తెలిపారు.

## గుమ్మకొండ గ్రామంలో శనివారం చెక్కభజన కార్యక్రమం మరియు ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహించబడును




మన గళండోన్ డోన్ మండలం లోని గుమ్మకొండ గ్రామంలో శ్రావణ మాసం శనివారం శ్రీ శ్రీ శ్రీ పాత పలమయ్య ఆంజనేయ స్వామి కి పూజారి, ఆలయ ధర్మ కర్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించబడును. కావునఆదివారంనాడు గ్రామంలో కోట్ల, కే. ఈ, వారి ఆశీసులతో రెండు తెలుగు రాష్ట్రాల పాల పండ్ల విభాగము 6 పళ్ళ లోపు ఎద్దులచే బండ లాగు పందెము నిర్వహించబడును. మొదటి బహుమతి 40వేలు . చిన్న రంగారెడ్డి, . రంగారెడ్డి, గుమ్మకొండ రంగస్వామి దాతల ద్వారా ఇవ్వబడును, రెండవ బహుమతి 30,000వేలు కుమ్మరి రమేష్ దాత చేతుల మీదుగా గెలుపొందిన ఋషభలకు ఇవ్వబడును అని తెలిపారు. మూడో బహుమతి దాత రాజధాని హోటల్ వారు 20000 వారి చేతుల మీదుగా గెలుపొందిన వృషభలకు ఇవ్వబడును. నాలుగో బహుమతి దాతలు . సుగాలీ నాయుడు,. హనుమప్ప నాయుడు, పదివేల రూపాయలు గెలుపొందిన ఋషభలకు ఇవ్వబడును. ఐదవ బహుమతి దాతలు చిన్న రామన్న గారి ధనుంజయ ,చిన్న లాలప్ప(కోతెన్న) 8000 రూపాయలు గెలుపొందిన వృషభాలకు వీరు చేతుల మీదుగా ఇవ్వబడును. ఐదో బహుమతి దాత సారాయి లక్ష్మన్న కుమారుడు 5000 రూపాయలు గెలుపొందిన ఋషభలకు ఈయన చేతుల మీదుగా ఇవ్వబడును. ఎంట్రీ ఫీజు 500 రూపాయలు ఉంటుందని తెలిపారు. ఆర్గనైజర్ స్ జి గోపాల్, బి నాగేశ్వరరావు, జి రాజారెడ్డి, బి రామకృష్ణ, ఈడిగ లక్ష్మన్న, హనుమప్ప నాయుడు మరియు అల్పాహార దాత పొట్టల సుంకన్న, అన్నదాతలు డీలర్ గోపాల్ గౌడ్ మరియు డీలర్ మధు, బి అనువాప్ప నాయుడు మరియు శనివారం రోజు రాత్రి 9 గంటలకు శ్రీ సీతారామాంజనేయ చెక్కభజన కార్యక్రమము రాంపల్లి శ్రీను శిశ బృందం వారిచే నిర్వహించబడును. చెక్కభజన దాతలు టి నారాయణ యోగానంద రెడ్డి హరిశంకర్ గౌడ్ బి హనుమప్ప నాయుడు ఈ కార్యక్రమము గ్రామ సర్పంచ్ దశరథరామిరెడ్డి మరియు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు సమక్షంలో నిర్వహించబడును. వివరములు కొరకు మా యొక్క ఫోన్ నెంబర్లు 9010085137, 9705541554, 9347177742, 9866444256

## నివాళి



మనగళం, ఓర్వకల్లు : ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామం టీడీపీ కార్యకర్త బజారన్న తల్లి పూజారి ఈశ్వరమ్మ మృతి చెందారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, టీటీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ తదితరులు ఈశ్వరమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## అట్టహాసంగా ఆర్యవైశ్య సభ్యుల ప్రమాణస్వీకారం



మనగళం, ఎమ్మిగనూరు: ఆర్యవైశ్య కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం బుధవారం ఎమ్మిగనూరులో అట్టహాసంగా జరిగింది. పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో నియోజకవర్గ ఆర్యవైశ్యుల సమావేశంలో అధ్యక్షులుగా ప్రతాప్ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా గుండ్రేవుల శ్రీనివాసులు శెట్టి, గౌరవ అధ్యక్షులు ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, ప్రధాన కార్యదర్శిగా అనుముల రాజశేఖర్ గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు.

## కోడుమూరు నందు చేనేత కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్న జాతీయ చేనేత దినోత్సవం






మన గళం కోడుమూరు: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇరువురి సంఘాల చేనేత కార్మికులు ఆధ్వర్యంలో 11 వ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పాత బస్టాండ్ నుంచి చేనేత కార్మికులు ర్యాలీ బయల్దేరి మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. చేనేత జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న అధ్యక్షతన చేనేత రాష్ట్ర అధ్యక్షులు కే రాజు, బి మాధవ స్వామి చేనేత కార్మికులు మహాత్మా గాంధీ కి చిట్టమాల పూలదండలు వేసి ఈ సందర్భంగా చేనేత వక్తలు మాట్లాడుతూ ఈ దేశంలో అధిక సంఖ్యలో రైతులు చేనేత కార్మికులు వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు దేశంలో ఈ కార్మికులు రెండు కళ్ళు లాంటి వారు చేనేత కార్మికులు తయారుచేసిన చీరలు అమ్ముడు పోక చాలా ఇబ్బందులు పడుతున్నారు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి వారిని పలు విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉన్నదని ప్రతి ప్రభుత్వ ఆఫీసులలో చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిస్తే చేనేత వస్త్రాలు అమ్ముడుపోయి చేనేత కార్మికులకు కాస్త ఊరటైన కలుగుతుందని నేతన్న నేస్తం ద్వారా 36000 వేల రూపాయలు ఇచ్చి అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇచ్చి, ఇల్లు నిర్మించాలని చేనేత కార్మికులకు పూచికత్తులేకుండా బ్యాంకు రుణాలు ఐదు లక్షలా రూపాయలు అందించాలి అర్హులైన వారికి చేనేత పెన్షన్లు అందించాలని చేనేత దినోత్సవం పురస్కరించుకొని వృద్ధ చేనేత కార్మికు లకు మస్తాన్ వలి, బుగుడే తిప్పన్న గార్లకు శాలువాలు కప్పి పూలదండలు వేసి సన్మానించారు. వ్యవసాయ సంఘం నాయకులు గఫూర్మియా, బి రాజు శేషు యాదవ్, చేనేత జిల్లా కమిటీ నాయకులు జి.పి వీరన్న, ఎస్ గంగాధర్, %ఖ.దీ%. రమేష్, బి శేఖర్, తాయప్ప, కే బుడ్డప్ప, బి. కుమార్, చేనేతకార్మికులు కే మునుస్వామి, కే శేఖర్, కే నాగరాజు, ఎన్ వెంకటేష్, మాసూం వలి, డి అమ్మన్న, డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐపీవోకు ఇండోసోల్..?

హైదరాబాద్‌కు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ, సోలార్ పీవీ మ్యాన్యుఫ్యాక్చరర్ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశించాలని చూస్తున్నది. ఈ క్రమంలోనే వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నడుస్తున్న 1 గిగావాట్ లైన్ పనులు పూర్తయితే ఐపీవోకు రంగం సిద్ధం కానున్నది. ఇండోసోల్.. ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటీవ్ (పీఎల్ఐ) స్కీమ్ కింద గుర్తింపును పొందినట్టు షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ సీఎండీ ఎన్ విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. రెండు విడుతల్లో మొత్తం రూ.5,175 కోట్ల ప్రోత్సాహకాలు అందుకున్నట్టు చెప్పారు.

# విద్యుత్ చార్జీల నిలువు దోపిడి ఆపాలి.

**– ప్రమాదకర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి. సీఐటీయూ డిమాండ్.**

మనగలం : శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామం.గత వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి 32 వేల కోట్ల భారం ప్రజల పైన వేసింది. ఇక బాదుడు ఉండదని టిడిపి బిజెపి జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని తగ్గిస్తామని ఎన్నికల ప్రణాళికలు హామీ ఇచ్చి ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని లోకేష్ నేతలు పిలుపు ఇచ్చారు నేడు కూటమి ప్రభుత్వం మాట తప్పిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసురత్నం మండల కార్యదర్శి చిన్న మారెన్న అధ్యక్షులు నాగరాజు నాయకులు ఎం మల్లికార్జున తెలిపారు రెండు కోట్ల మంది విద్యుత్ వినియోదారుల నుంచి స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజల నుంచి దోచుకోవడానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. అదాని కంపెనీ రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోదారులకు పాత మీటర్లు తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నది ఇది మీటర్ మార్పు కాదు విధానం మార్పు విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు కార్పొరేట్లకు కట్టపట్టడానికి చేస్తున్న కుట్రలో ఇది ఒక భాగము. సెల్ఫోన్ తరహాలో ఇక ముందుగానే డబ్బులు చెల్లించి కరెంటు కూడా రీఛార్జి చేయించుకోవాలి ఈ పద్ధతి వలన బడా కంపెనీలు దేశంలో 23 లక్షల కోట్ల అడ్వాన్స్ రూపంలో జనం నుండి గుంజుతారు. ఈ మీటర్ ఖర్చు సింగిల్ ఫేస్ కు 9000 రూపాయలు త్రీఫేస్కు 17వేల రూపాయలు 93 నెలలలో వాయిదాల పద్ధతిలో జనం నుంచి వసూలు చేస్తారు. తర్వాత మళ్లీ మీటర్ మార్చుకోవాల్సిందే డబ్బులు మళ్ళీ కట్టాల్సిందే. గంట గంటకి రీడింగ్ తీస్తారు. పగలు కంటే రాత్రి వాడే కరెంటుకు అధిక బిల్లులు వేస్తారు. వేసవి కాలంలో ఎక్కువ రేటు వసూలు చేస్తారు. ఈ మీటర్ల వల్ల ప్రజలకు ప్రమాదం ఉంది అందుకే ప్రజలు అదాని స్మార్ట్ మీటర్లను బిగించుకోవద్దని వారు తెలిపారు. అదా నీ స్మార్ట్ మీటర్లు ఆపాలి. పెట్టిన మీటర్లు తొలగించాలి. ట్రూ ఆఫ్ ఇంధన సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలి అదనపు భారాలు తగ్గించాలి ఇప్పటివరకు వసూలు చేసిన సర్దుబాటు చార్జీలను ప్రజలకు తిరిగి ఇవ్వాలి పార్టీలకతీతంగా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించి ఆదాని స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని వారి కోరారు. గ్రామ గ్రామాన ప్రజలందరూ కలిసి ఆదా నీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని అనుమతి లేకుండా మీటర్లు పెడితే పోలీసు కేసులు పెట్టండి అని వారన్నారు. గతంలో పోరాటం చేసిన ఫలితంగా చెత్త పన్నుపై పోరాటంతో రద్దయింది వ్యవసాయ పంపు చెట్లకు మీటర్లు ఆగాయి. అందరూ కలిసి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడుదాం. విద్యుత్తు అదనపు భారాలను తగ్గించుకుందాం అని వారు తెలిపారు.




# లేఔట్ ల పై అవగాహన



మన గళండోన్ ఆర్ అండ్ బి అతిధి గృహంలో కుడా 1 మోహన్ కుమార్, 2 విజయ భాస్కర్, హేయత్ మొహిద్దిన్ ల ఆధ్వర్యంలో డోన్ నియోజకవర్గానికి చెందిన మున్సిపల్ మరియు గ్రామ పంచాయతీ సెక్రెటరీలకు భవన నిర్మాణ లేఔట్ ల పైన అవగాహన ప్రోగ్రామ్ నిర్వహించారు, ఈ ప్రోగ్రాం కి ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ . నవ్య (కర్నూలు జాయింట్ కలెక్టర్) హాజరయ్యారు, ఈ కార్యక్రమంలో డోన్, మున్సిపల్ కమీషనర్ ప్రసాద్ గౌడ్ , పంచాయతీ సెక్రటరీ లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాలు






– భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

మనగళం, మంత్రాలయం : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం భద్రతా ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. మఠం పరిసర ప్రాంతాలు, తుంగభద్ర నది తీరం, ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు, క్యూలైన్ లు, వీఐపీల ప్రోటోకాల్ గురించి జిల్లా ఎస్పీకి మంత్రాలయం సీఐ రామంజులు, ఎస్ఐ శివాంజల్ వివరించారు. భక్తులు, చిన్నపిల్లలు, ప్రజలు తుంగ భద్ర నది వరద ఎక్కువగా ఉన్నప్పుడు నదిలోకి వెళ్ళకుండా అప్రమత్తం చేయాలని జిల్లా ఎస్పీ పోలీసులకు సూచించారు. తుంగభద్రా నది తీరంలో పోలీసులు, మఠం సిబ్బంది 24 గంటలు జాగ్రత్తగా బందోబస్తు నిర్వహించాలని సూచించారు. లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ భార్గవి, సీఐ రామా%శీ%జులు, ఎస్ఐ శివాంజల్ లకు ఎస్పీ సూచించారు.

# దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (07.08.2025) ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది.ల ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహ సరస్వతీ స్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

# యూనియన్ బ్యాంకు ఇన్సూరెన్స్ సేవలను వినియోగించుకోవాలి మేనేజర్ రమేష్ బాబు



మన గళం కోడుమూరు: కోడుమూరు లో యూనియన్ బ్యాంక్ వారు నిర్వహించిన, లైఫ్ ఇన్సూరెన్స్ సదస్సు లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కొడుమూరు నియోజకవర్గ ఇన్చార్జి నాయకులు బి కృష్ణ పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వం తలపెట్టిన ఇన్సూరెన్స్ సౌకర్యము ను యూనియన్ బ్యాంక్ కూడా వర్తింపచెయ్యడం హర్షించదగ్గ విశయమన్నారు. బ్యాంక్ ఖాతాదారులు అయినటువంటి వారు ప్రతి సంవత్సరము 489/–రూ చెల్లిస్తే వారికి ప్రమాదవశాత్తూ మరణిస్తే వారికి 2,00,000/– రూపాయిలు ఇన్సూరెన్స్ ద్వారా చెల్లిస్తుంది అని, అలాగే సంవత్సరము కు 20/– రూపాయిలు కడితే వారికి సాధారణ మరణం జరిగితే 2,00,000/– రూపాయిలు ప్రభుత్వం చెల్లిస్తుందని, ఈ ఇన్సూరెన్స్ ఖాతాదారులకు మంచి అవకాశం అన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమేష్ బాబు మాట్లాడుతు, ఈ ఇన్సూరెన్స్ పాలసీ ని బ్యాంక్ ఖాతాదారులు అందరు ఉపయోగించుకోవాలన్నారు. ఖాతాదారుల అకౌంట్ లో మిగులు బ్యాలెన్స్ ఉంటే అకౌంట్ లో నుంచి ప్రతి సంవత్సరము బ్యాంక్ వారే చెల్లిస్తారు అని, అలాగే 50 సంవత్సరాలు దాటిన వారికి ప్రమాద భీమ పథకం వర్తించదు అని వారు 20/– రూపాయిలు చెల్లించాలని, 50 సంవత్సరాలు లోపు ఉన్నవారు 489/– రూపాయల ప్రమాద భీమ పథకం వర్తిస్తుంది అని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మహేంద్ర, యశ్వంత్, ఖాతాదారులు పాల్గొన్నారు.

# శ్రీశైలం ఘాట్ రోడ్ లో ఘోర రోడ్డు ప్రమాదం

మనగళం శ్రీశైలం : శ్రీశైలంలోని ఘాటు రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం శ్రీశైలానికి అతి సమీపంలోనే ఉన్న రామయ్య టర్నింగ్ వద్ద స్కూటీ మరియు యమహా ఎఫ్ జెడ్ వాహనాలు యాక్సిడెంట్ గురయ్యాయి అందులో ఒక వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు మరియొక వ్యక్తిని వెంటనే అంబులెన్స్ సహాయంతో హాస్పిటల్ కి తరలించారు



# దివీస్ లాభం రూ 545 కోట్లు




మన గళం : దివీస్ లాభం రూ.545 కోట్లు వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి దివీస్ లేబరేటరీస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేక పోయాయి. ఈ కాలానికి కంపెనీ రూ.2,410 కోట్ల ఆదాయంపై రూ.756 కోట్ల స్థూల లాభం, రూ.545 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 14 శాతం, స్థూల లాభం 16.3 శాతం, నికర లాభం 27 శాతం పెరిగాయి. అయితే మార్కెట్ వర్గాలు ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.2,437 కోట్ల ఆదాయంపై రూ.794.8 కోట్ల స్థూల లాభం, రూ.573.25 కోట్ల వరకు నికర లాభం నమోదు చేస్తుందని అంచనా వేశాయి. జూన్ త్రైమాసికంలో కంపెనీ స్థూల లాభ శాతం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 0.7 శాతం పెరిగి 31.4 శాతానికి చేరింది. క్యూ1 ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బుధవారం బీఎసఈలో దివీస్ షేర్లు 4.29 శాతం నష్టపోయి రూ.6,134.25 వద్ద ముగిశాయి.

# స్టార్టప్‌లకు మద్దతుగా 100 కోట్ల నిధి

మన గళం : దేశానికి చెందిన అగ్రగామి వెంచర్ స్టూడియో బయోమి రూ.100 పెట్టుబడుల సమీకరణను పూర్తి చేసినట్టు ప్రకటించింది. బయోమి తన సమీకృత వ్యూహం, ప్రతిభ, మూలధన నమూనా ద్వారా ప్రతీ ఏడాది అధిక కట్టుబాటు గల స్టార్ట్‌పలను గుర్తించి మద్దతు అందిస్తుంది. తొలి విడతలో బీవీఆర్ మెహన్ రెడ్డి (సైయెంట్), ప్రసాద్ యెర్నేని (ఎకోరెన్ ఎనర్జీ), అభినవ్ రెడ్డితో పాటు (గర్ కార్పొరేషన్) కొన్ని కుటుంబ గ్రూప్‌లను కూడా ఒక వేదిక పైకి తెచ్చింది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..
# 166 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్..!



మన గళం : దేశీయ స్టాక్ మార్కెట్‌లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) అంచనాలకు అనుగుణంగా కీలక వడ్డీ రేట్లను యథావిధిగా కొనసాగించింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 5.5 శాతం వద్దే ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ ప్రస్తుతం ఉన్న 5.5 శాతం రెపోరేటు కొనసాగుతుందని ప్రకటించారు. ఇదిలా ఉండగా.. దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఉదయం 80,694.98 ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 80,834.43 పాయింట్ల గరిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,448.82 పాయింట్లకు పడిపోయింది. చివరకు 166.26 పతనమై.. 80,543.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 75.35 పాయింట్లు తగ్గి 24,574.20 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం తగ్గాయి. నిఫ్టీలో విప్రో, సన్ ఫార్మా, జియో ఫైనాన్షియల్, ఇండస్ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా అత్యధికంగా నష్టపోగా.. ఏషియన్ పేయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ లాభపడ్డాయి. పీఎస్‌యూ బ్యాంక్ (0.6 శాతం) మినహా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మీడియా, రియాల్టీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ ఒకటి నుంచి 2శాతం తగ్గాయి. ఇతర రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి.

# చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి




**- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

మనగళం, ఎమ్మిగనూరు : చేనేతల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గురువారం ఉదయం ఎమ్మిగనూరు పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి చేనేత జాతీయ సంపదగా కొనసాగుతోందని, చేనేత అద్భుతమైన కళ అని కొనియాడారు. టెక్స్టైల్ పార్క్ కొరకు గుర్తించిన 77 ఎకరాల్లో ప్రత్యేకంగా చేనేత సంక్షేమం కోసం 22 ఎకరాలను కేటాయించి, డిపిఆర్ సిద్ధం చేయడం చేయడం జరిగిందన్నారు. ఇందులో రూ.6 కోట్లతో ఏపీఐఐసి ఆధ్వర్యంలో రోడ్లు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. టిడ్కో గృహాల వద్ద ఒక ఎకరాలో వీవర్ శాల ను ఏర్పాటుచే సేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. చేనేత కార్మికులు స్వయం సహాయక సంఘాలు గా ఏర్పడితేనే చాలా సౌకర్యాలు, లబ్ధి చేకూరనున్నందున సంఘాలుగా ఏర్పడాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న 2 వేల 457 మంది చేనేత కుటుంబాలకు ఉచితంగా నెలకు 200 యూనిట్లు అదే విధంగా మరమగ్గాలు ఉన్న కుటుంబాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను అందించడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఉన్న 3611 చేనేత కార్మికులకు ప్రతి నెల 4 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని, ఇందుకోసం ప్రతి నెల రూ. 1.44 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. సీడిపి పథకం కింద 484 మందికి రూ.78.24 లక్షల విలువగల మగ్గం పరికరాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ముద్ర పథకం కింద 166 మందికి ఒకొకరికి 50 వేల రూపాయలు చొప్పున రూ.83 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. చేనేత వస్త్రాల పై విధిస్తున్న 5 శాతం జిఎస్టీ కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద 161 మందికి 2025 సంవత్సరమునకు రూ.18.08 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. నూలు కొనుగోలు పై 15 శాతం రాయితీ కూడా ఇవ్వడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు. ఎమ్మిగనూరు ఎంఎల్ఏ జయ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ చేనేతకు పూర్వవైభవం తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గాన్ని దేశ చరిత్రలో చేనేత పురిగా నిలిపిన మహానుభావుడు పద్మశ్రీ మాచాని సోమప్ప అని గుర్తు చేశారు. చీర ఎమ్మిగనూరు లో నేసి గద్వాల పేర్లేసుకోవడం జరుగుతోందన్నారు. ఈ పరిస్థితిని మార్చి పూర్వ వైభవం తీసుకొని వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 77 ఎకరాలు టెక్స్టైల్ పార్కు కొరకు కేటాయిస్తే, అందులో 22 ఎకరాలు కేవలం చేనేత మగ్గాల



కోసం కేటాయించడం జరిగిందన్నారు. ఎమ్మిగనూరులో మగ్గం వేసే 1800 మంది చేనేత కళాకారులు కుటుంబాలకు కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ 1800 మంది కూడా రానున్న రోజుల్లో అతి త్వరలోనే గతంలో లాగానే సొసైటీలు నిర్మించుకోబోతున్నామన్నారు. రాబోయే రోజుల్లో మన సొసైటీల ద్వారా టెక్స్టైల్ పార్కు లో 22 ఎకరాలలో 100 కోట్ల రూపాయలతో పైలట్ ప్రాజెక్టు మొదలు పెట్టబోతున్నామన్నారు. టిడ్కో ప్రాంగణంలో ఒక్క ఎకరాలో వీవర్ శాల ను ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. మగ్గాలపై విద్యుత్ సబ్సిడీ, జీఎస్టీ మాఫీ వంటి సహాయాలతో చేనేత వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు ఇస్తుందని తెలిపారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రెండు చేనేత కుటుంబాలకు సహాయంగా ఒక్కొక్కరికి రూ.1.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని, అంతలోపు ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లగా ఒక్కొక్కరికి 50 వేల రూపాయల చెక్కులను అందజేశారన్నారని గుర్తు చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క కుటుంబానికి రూ. 1.5 లక్షల ఆర్థిక సహాయం అందించనుందన్నారు.. ఎమ్మిగనూరులో తాగునీటి సమస్యల పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుండి 24 గంటలు నీరు అందించనున్న టెండర్లు ఆమోదం పూర్తయ్యాయన్నారు. జిల్లాలో ముద్ర రుణాలు కింద చేనేత కార్మికులకు మంజూరు అయిన రూ. 83 లక్షల 50 వేలకు సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్, ఎమ్మెల్యే అందచేశారు. అనంతరం 20 మంది సీనియర్ చేనేత కళాకారులను కలెక్టర్, ఎమ్మెల్యే సన్మానించారు. ముందుగా అక్కడే ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలపై ఆర్గానిక్ ప్రింట్ కు సంబంధించిన స్టాల్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, ఎల్ డి ఎం రామచంద్ర రావు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు నాగరాజ రావు, ఎమ్మిగనూరు చేనేత సొసైటీ ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమలో మృణాల్ ఠాకూర్..?





మన గళం,సినిమా : దక్షిణాది అగ్రనటుడు ధనుష్‌తో మృణాల్ ఠాకూర్ ప్రేమలో ఉందనే వార్తలు ప్రస్తుతం ముంబయి సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. వీరిద్దరి డేటింగ్‌పై ఆంగ్ల మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ జంట ప్రేమబంధానికి కొద్ది మాసాల క్రితమే బీజం పడిందని అంటున్నారు. ఇటీవల జరిగిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ధనుష్ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మృణాల్‌తో చనువుగా ఉన్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. కొన్ని నెలల క్రితం చెన్నైలో జరిగిన ఓ సినిమా ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ మధ్య తొలిసారి పరిచయం ఏర్పడిందని, అక్కడే వీరి ప్రేమప్రయాణానికి తొలి అడుగులు పడ్డాయని అంటున్నారు. ధనుష్ సోదరీమణులు కార్తీక, విమల గీత ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఠాకూర్‌ను ఫాలో కావడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. ధనుష్ తన కుటుంబ సభ్యులకు మృణాల్ ఠాకూర్‌ను పరిచయం చేశారని అంగ్ల మీడియాలో వార్తలొచ్చాయి. తమ ప్రేమబంధంపై ప్రస్తుతం ఈ జంట గోప్యతను పాటిస్తున్నారని, సరైన సమయంలో అందరికి తెలియపరిచే ఆలోచనలో ఉన్నారని సమాచారం.గత కొద్దిరోజులుగా మీడియాలో వస్తున్న డేటింగ్ వార్తలపై ఈ తారలిద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. దాంతో డేటింగ్ రూమర్స్ నిజమేనని అభిమానులు భావిస్తున్నారు.




# అభిమానుల ప్రేమే రక్షాకవచం

మన గళం,సినిమా : 79వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం ఫీనిక్స్ ఫౌండేషన్, చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మెగాబ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ను ప్రారంభించాయి. ఈ కార్యక్రమంలో అగ్ర నటుడు చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువ హీరో తేజ సజ్జా, కథానాయిక సంయుక్తమీనన్ అతిథులుగా హాజరయ్యారు. బుధవారం నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో 800 మంది వరకు పాల్గొన్నారని, సేకరించిన రక్తాన్ని భారత సైన్యానికి విరాళంగా అందించబోతున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'రక్తదానం అనగానే నా పేరు గుర్తుకురావడం పూర్వజన్మ పుణ్యఫలంగా భావిస్తున్నా. సోషల్‌మీడియాలో వచ్చే విమర్శలపై మీరెందుకు స్పందించరని చాలా మంది అడుగుతుంటారు. అలాంటి అనవసర విషయాలపై నేనెప్పుడూ స్పందించను. ఎందుకంటే నేను చేపట్టిన సామాజిక కార్యక్రమాలు, నాపై అభిమానులు చూపించే ప్రేమే నాకు రక్షణ కవచాలుగా భావిస్తాను. నేను మాట్లాడాల్సిన అవసరం లేదు. నా మంచితనమే మాట్లాడుతుంది. రక్తదానం వంటి మంచి కార్యక్రమాలు ఎవరు చేసినా నన్ను పిలిస్తే తప్పకుండా వచ్చి మద్దతునిస్తాను' అన్నారు.

# జ్యోతికని మించిన అందం..!



మన గళం,సినిమా తమిళ నటుడు సూర్యకి తమిళంలోనే కాక తెలుగులోను ప్రత్యేకమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆయన సినిమాలతోనే కాకుండా సేవా కార్యక్రమాలతో అందరి మనసులు గెలుగుచుకున్నాడు. సూర్య స్థాపించిన 'అగరం ఫౌండేషన్'కు 15 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా చెన్నైలో ఇటీవల ఘనంగా వేడుక నిర్వహించారు. ఈ వేడుకకి ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ప్రముఖులు వెట్రి మారన్, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ వేడుకలో సూర్య-జ్యోతిక దంపతులు , వారి పిల్లలు దియా, దేవ్ , అలాగే సూర్య సోదరుడు కార్తీ కుటుంబంతో పాల్గొన్నారు. అగరం ఫౌండేషన్ 15 ఏళ్ల ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, ఇప్పటి వరకు అందించిన సేవలను అందరితో పంచుకున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సూర్య కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సూర్య, జ్యోతిక, వారి పిల్లలు దియా, దేవ్‌లతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పండితులు వారికి ఆశీర్వచనాలు అందించారు. ఆలయం వెలుపల సూర్యను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు, భక్తులు గుమిగూడారు. ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవడానికి ఉత్సాహం చూపించారు. ఆ సందర్భంలో తీసిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలలో సూర్య కూతురు దియా సంప్రదాయ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. నెటిజన్లు ఆమె లుక్స్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. తల్లిన మించిన అందం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు జ్యోతిక గ్లామర్ కూడా ఏ మాత్రం తగ్గలేదని అంటున్నారు. ప్రస్తుతం వారి పిక్స్ సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. కాగా, సూర్య స్థాపించిన అగరం ఫౌండేషన్ అనే సాంఘిక సేవా సంస్థ 15 సంవత్సరాల క్రితం ప్రారంభం కాగా, ఈ సంస్థ ప్రధానంగా తమిళనాడులోని నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఈ ఫౌండేషన్ చేపట్టిన 'విద్యా ప్రాజెక్ట్' ద్వారా ఇప్పటి వరకు 6700 మందికి పైగా గ్రాడ్యుయేట్లను సమాజానికి అందించారు. అనేక మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిన అగరం ఫౌండేషన్ సేవలు అభినందనీయమైనవి.



# మంచు మనోజ్ కొత్త సినిమా.. పోస్టర్ విడుదల



మన గళం,సినిమా టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా "డేవిడ్ రెడ్డి" అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి డైరెక్ట్ చేయగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. విడుదలైన టైటిల్ పోస్టర్, మేకర్స్ విడుదల చేసిన సమాచారం ఈ ప్రాజెక్టుపై భారీగా ఆసక్తిని పెంచాయి. ఈ సినిమా కథ 1897 నుంచి 1922 మధ్యకాలాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతుంది. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటూ, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతుడి కథగా ఇది తెరకెక్కుతోంది. మనోజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని లుక్‌లో, ఒక విప్లవవాది పాత్రలో కనిపించనున్నారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో జన్మించాడు%ొ% ఢిల్లీలో పెరిగాడు%ొ% ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలించాడు అనే స్టేట్మెంట్‌తో రివీల్ చేసిన టైటిల్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇటీవల భైరవం సినిమాలో తన యాక్టింగ్ స్కిల్స్‌తో ప్రశంసలు అందుకున్న మనోజ్, ఇప్పుడు మిరాయ్ అనే చిత్రంలో విలన్‌గా నటిస్తున్నారు. అలాగే "డేవిడ్ రెడ్డి"లో మరింత పవర్‌ఫుల్‌గా కనిపించబోతున్నారు. సినిమా కేవలం యాక్షన్ డ్రామా కాదు, ఒక చారిత్రక నేపథ్యంతో కూడిన భావోద్వేగాలు, తాత్వికత కలగలిసిన హై ఓక్టేన్ డ్రామాగా రూపొందుతోందని తెలుస్తోంది.టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మనోజ్ 21 సంవత్సరాల జర్నీని బ్యాంగ్‌తో సెలబ్రేట్ చేస్తున్నారు. ఈసారి, ఒక నిర్భయ తిరుగుబాటు దారుడిగా వస్తున్నారు. టైటిల్ 'డేవిడ్ రెడ్డి'. ఇది 1897 - 1922 నేపథ్యంలో సాగే తీవ్రమైన చారిత్రక యాక్షన్ డ్రామా" అని చిత్రబృందం తెలిపింది. తాజాగా రిలీజ్ అయిన పోస్టర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేస్తోంది. మనోజ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచే అవకాశం ఉన్న ఈ చిత్రంపై అభిమానులు భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. మరి ఈ సినిమా మనోజ్‌కి కంబ్యాక్ హిట్ ఇస్తుందా? అసలు "డేవిడ్ రెడ్డి" అనే పాత్రలో మనోజ్ ఎలా కనిపిస్తారు? అనేది తెలుసుకోవాలంటే కొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

# ఆసియా కప్ సెలెక్టర్లకు సవాల్‌గా జట్టు ఎంపిక..!




మన గళం, భారత జట్టు ఇంగ్లండ్ పర్యటన ముగిసింది. ప్లేయర్స్ అంతా స్వదేశానికి తిరిగి వస్తున్నారు. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోన టీమిండియా అద్భుతంగా రాణించింది. ఇకపై భారత జట్టు ఆసియా కప్‌కు సన్నద్ధం కానున్నది. ఈ ఏడాది సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ మొదలు కానున్నది. ఈ సారి ఈ టోర్నీ టీ20 ఫార్మాట్‌లో జరుగనున్నది. ఆసియా కప్ జట్టును ఎంపిక చేసేందుకు సెలక్షన్ కమిటీకి పెద్ద సవాల్‌గా మారింది. టీ20 జట్టు ఇటీవల కాలంలో నిలకడగా రాణిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల మూడోవారం వరకు ఆసియా కప్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటిస్తుందని భావిస్తున్నారు. జట్టులో చోటు కోసం యశస్వి జైస్వాల్, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ పోటీలో ఉన్నారు. సెప్టెంబర్ 28న జరిగే టీ20 టోర్నీలోని ఫైనల్‌కు భారత్ అర్హత సాధిస్తే.. కొద్దిరోజులకే వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్‌లో భారత్ వెస్టిండీస్ మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఐపీఎల్ చివరి సీజన్‌లో యశస్వి మంచి ఫామ్‌లో కనిపించాయి. 160 స్ట్రయిక్ రేట్‌తో 559 పరుగులు చేశాడు. గిల్ 15 మ్యాచుల్లో 155 కంటే ఎక్కువ స్ట్రయిక్ రేట్‌తో 650 పరుగులు చేరశాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుతో శుభ్‌మన్ గిల్‌తో ఓపెనింగ్‌కు దిగే సాయి సుదర్శన్ సైతం 156 స్ట్రయిక్ రేట్‌తో 759 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్‌ను దక్కించుకున్నాడు. ఈ ముగ్గురికి టీ20 జట్టులో చోటు కల్పిస్తారా? లేదా ఉన్నది చూడాల్సిందే. ఆసియా కప్‌లో ఆడే ప్లేయర్స్ అంతా ఫైనల్ వరకు 21 రోజులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. ఆసియా కప్ కోసం 17 మంది సభ్యులతో జట్టును ఎంపిక చేయనుండగా.. ప్రస్తుతం ఉన్న ఆప్షన్స్‌ను సెలెక్టర్లు జాగ్రత్తగా పరిశీలించన్నట్లు బీసీసీఐ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా తెలిపింది. ఆసియా కప్ యూఏసీలో ఆసియా కప్ జరుగనున్న విషయం తెలిసిందే. టీ20 ప్రపంచకప్‌ని బట్టి చూస్తే యశస్వి, గిల్, సాయి సుదర్శన్ టాప్ ఆర్డర్‌లో కీలక ఆటగాళ్లు అయ్యే అవకాశం ఉంది. సాయి సుదర్శన్ టీ20ల్లో అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అయితే, టీమిండియాకు బౌలింగ్ విభాగంలో ఇబ్బందికరంగా మారింది. కీలక టోర్నీకి ఫాస్ట్ బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఆసియా కప్ తర్వాత వెంటనే వెస్టిండిస్‌తో సిరీస్ నేపథ్యంలో వీరి విషయంలో సెలెక్టర్లు జాగ్రత్తలు తీసుకునే అవకాశాలున్నాయి. అదే సమయంలో సెలక్షన్ కమిటీ సమావేశానికి ముందు ఫిట్‌నెస్‌ను సైతం అంచనా వేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

# ఐసీసీ ర్యాంకింగ్స్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో సిరాజ్‌కు అత్యుత్తమ ర్యాంకు..!



మన గళం, ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో అద్భుతంగా రాణించిన టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నాడు. ఓవల్‌లో జరిగిన చివరి ఓవల్ టెస్ట్‌లో సిరాజ్ కారణంగానే టీమిండియా ఆరు పరుగుల తేడాతో గెలవగలిగింది. దాంతో భారత్ సిరీస్‌ను 2-2 సమం చేయగలిగింది. ఐదో టెస్ట్ మ్యాచ్ చివరి రోజున మ్యాచ్, సిరీస్‌ను గెలవడానికి ఇంగ్లాండ్‌కు 35 పరుగులు అవసరం కాగా.. సిరీస్‌ను సమం చేయడానికి భారత్‌కు నాలుగు వికెట్లు అవసరం. ఐదోరోజు సిరాజ్ మూడు వికెట్లు కూల్చి భారత్‌కు విజయాన్ని కట్టబెట్టాడు. సిరాజ్ 12 ర్యాంకులు మెరుగుపరుచుకొని 15వ స్థానానికి చేరుకున్నాడు. హైదరాబాదీ బౌలర్‌కు ఇదే కెరియర్‌లో అత్యుత్తమ ర్యాంకు. ఇంతకు ముందు ఈ ఏడాది జనవరిలో 16వ ర్యాంక్ వరకు చేరాడు. వర్క్ మేనేజ్‌మెంట్ నేపథ్యంలో బుమ్రాకు విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో మూడు మ్యాచులు ఆడిన జస్ప్రీత్ బుమ్రా 889 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ సైతం అత్యుత్తమంగా 59వ ర్యాంక్‌కు చేరుకుదున్నారు. భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఓవల్ టెస్ట్‌లో సెంచరీ సాధించి తిరిగి టాప్-5లో చోటు దక్కించుకున్నాడు. యశస్వి మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 5వ స్థానానికి చేరుకున్నాడు. టాప్-10లో ఉన్న మరో బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ ఒక స్థానం దిగజారి 8వ ప్లేస్‌కు చేరుకున్నాడు. గాయం కారణంగా పంత్‌కు దూరమైన విషయం తెలిసిందే. దాంతో ఓవల్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ జో రూట్ అద్భుత బ్యాటింగ్ చేయగా.. ప్రస్తుతం బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సెంచరీ హీరో హ్యారీ బ్రూక్ రెండో స్థానానికి చేరుకున్నాడు. బౌలర్లలో ఇంగ్లాండ్‌కు చెందిన ఫాస్ట్ బౌలర్ గస్ అట్కిన్సన్, జోష్ టంగ్ సైతం కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంకింగ్స్‌కు చేరుకున్నారు. అట్కిన్సన్ తొలిసారిగా టాప్ 10లోకి ప్రవేశించగా.. టంగ్ 14 స్థానాలు మెరుగుపడి 46వ స్థానానికి చేరాడు.

# రషీద్ ఖాతాలో అరుదైన రికార్డు




మన గళం, అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టీ20 చరిత్రలో సరికొత్త రికార్డు లిఖించాడు. ఇంగ్లండ్‌లో జరుగుతున్న 'ది హండ్రెడ్' టోర్నీలో లండన్ స్పిరిట్ తరఫున ఆడుతున్న రషీద్.. ఓవల్ ఇన్‌విసిబుల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టి పొట్టి ఫార్మాట్‌లో 650 వికెట్లు తీసిన మొదటి బౌలర్‌గా రికార్డులకెక్కాడు. ఈ మ్యాచ్‌లో 20 బంతులేసిన రషీద్.. 11 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీశాడు. టీ 20 (అంతర్జాతీయ, లీగ్‌లు కలిపి)లలో రషీద్ 478 ఇన్నింగ్స్‌లలో 651 వికెట్లు తీయగా విండీస్ దిగ్గజం డ్వేన్ బ్రావో 631 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు.

# సెమీస్‌కు ఒసాకా



మన గళం, నాలుగు సార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్, జపాన్ స్టార్ ప్లేయర్ నవొమి ఒసాకా కెనడా ఓపెన్‌లో అదరగొడుతున్నది. మాంట్రీల్‌లో జరుగుతున్న ఈ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఒసాకా.. మంగళవారం రాత్రి జరిగిన క్వార్టర్స్ పోరులో 6-2, 6-2తో పదో సీడ్ ఎలీనా స్వితోలినాను చిత్తుచేసి సెమీస్ చేరింది. సెమీస్‌లో ఒసాకా 16వ సీడ్ క్లారా టాసన్‌తో తలపడనుంది. యూఎస్ ఓపెన్‌కు ముందు జరుగుతున్న ఈ టోర్నీలో సెమీస్‌కు చేరడం ఒసాకా కెరీర్‌లో ఇదే మొదటిసారి. 2021లో ఆస్ట్రేలియా ఓపెన్ గెలిచిన తర్వాత ఒక్క టూర్ టైటిల్ కూడా నెగ్గని ఆమె.. కెనడా ఓపెన్‌ను గెలవాలనే పట్టుదలతో ఉంది. మరో క్వార్టర్స్‌లో టాసన్.. 6-1, 6-4తో మాడిసన్ కీస్‌ను ఓడించింది.

# తెలంగాణ స్విమ్మర్లు పతకాలతో సత్తా

మన గళం, అహ్మదాబాద్‌లో జరుగుతున్న 51వ జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లు పతకాలతో సత్తా చాటుతున్నారు. బుధవారం జరిగిన పోటీల్లో రాష్ట్రానికి చెందిన శ్రీ నిత్య పసిడి పతకం గెలుచుకోగా శివాని కాంస్యం నెగ్గింది. మహిళల గ్రూప్-1 200 మీటర్స్ బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో శ్రీ నిత్య.. 2:21.56 నిమిషాల్లో లక్ష్యాన్ని పూర్తిచేసి స్వర్ణాన్ని ముద్దాడింది. కర్నాటకకు చెందిన నైషా , తమిళనాడు స్విమ్మర్ ప్రమితి వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. మహిళల గ్రూప్-2 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో శివాని.. 2:30.34 నిమిషాల్లో లక్ష్యం చేరి కాంస్యం సాధించింది. ఈ విభాగంలో అన్వి (మహారాష్ట్ర) స్వర్ణం, ఒవియ (తమిళనాడు) రజతం గెలిచారు.



# స్వర్ణ పతకాలతో గురుకుల విద్యార్థుల సత్తా



మన గళం, హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీల్లో మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు స్వర్ణ పతకాలతో సత్తా చాటారు. ఈనెల 3, 4 తేదీల్లో జరిగిన పోటీల్లో మహబూబ్ నగర్ జిల్లాలోని కోయిల్ కొండ బీసీ గురుకుల కాలేజీలో ఇంటర్ సెకండీయర్ చదువుతున్న కే. శివకుమార్.. 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లిలోని బీసీ గురుకుల కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న భరత్.. 600 మీటర్ల రేసులో పసిడి పతకం గెలుచుకున్నాడు. పతకాలు గెలిచిన విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సెక్రటరీ శ్రీధర్ తదితరులు అభినందించారు.

# యూఎస్ ఓపెన్ సింగిల్స్ విజేతకు పెరిగిన ప్రైజ్‌మనీ



మన గళం,టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్ స్లామ్ యూఎస్ ఓపెన్ ప్రైజ్‌మనీ భారీగా పెరిగింది. పురుషులు, మహిళల సింగిల్స్ విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని గతంలో కంటే ఏకంగా 39 శాతానికి పెంచారు. నిరుడు సింగిల్స్ చాంపియన్ రూ. 31.57 కోట్లు తీసుకోగా.. ఇకనుంచి విజేతకు రికార్డుస్థాయిలో రూ. 43.86 కోట్లు దక్కనుంది. రన్నరప్‌నకు రూ. 21.93 కోట్లు లభించనుంది. సెమీఫైనలిస్టులు రూ. 11 కోట్లు చొప్పున అందుకోనున్నారు. ఓవరాల్ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 745 కోట్లు. 4 గ్రాండ్‌స్లామ్స్‌లో యూఎస్ ఓపెన్ ప్రైజ్‌మనీనే అధికం. సింగిల్స్ విజేతలకిచ్చే ప్రైజ్‌మనీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రూ. 20 కోట్లు, ఫ్రెంచ్ ఓపెన్‌లో రూ. 25 కోట్లు, వింబుల్డన్‌లో రూ. 35 కోట్లుగా ఉంది. యూఎస్ ఓపెన్ ఈనెల 24న మొదలుకానుంది.

# భారత బాక్సర్ల పతకాల పంట

మన గళం, ఆసియా అండర్-19, 22 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్లు పతకాల పంట పండించేందుకు అడుగుదూరంలో నిలిచారు. బుధవారం జరిగిన అండర్-22కి సంబంధించిన పలు కేటగిరీలలో నలుగురు యువ బాక్సర్లు సెమీస్‌లో తమ ప్రత్యర్థులను చిత్తుగా ఓడించి ఫైనల్ చేరారు. పురుషుల 90 కిలోల విభాగంలో ఇషాన్ కటారియా నీరజ్ (75 కి.) ఫైనల్స్ చేరగా మహిళల విభాగంలో యత్రి పటేల్ (57 కి.), ప్రియ (60 కి.) స్వర్ణం లేదా రజతాన్ని ఖాయం చేసుకున్నారు. మొదట నీరజ్.. 5-0తో దక్షిణ కొరియా బాక్సర్ కియొంగొ బంగ్‌ను ఓడించి ఫైనల్ చేరగా ఇషాన్.. చైనాకు చెందిన చెన్ చెన్‌పై గెలిచాడు. యత్రి.. 5-0తో తి నుంగ్ (వియత్నాం)ను చిత్తుచేసింది. మరో పోరులో ప్రియ.. ఉజ్బెకిస్థాన్ బాక్సర్ ఇస్మాయిలొవపై ఏకపక్ష విజయం సాధించింది. హర్ష్ (60 కి.), మయూర్ (90 కి.) సెమీస్‌లో ఓడినా కాంస్య పతకాలతో సంతృప్తి పడ్డారు.

# బీసీసీఐకు భారీ ఊరట..!

## ఆర్‌టీఐ నుంచి తప్పించుకొన్న బీసీసీఐ




మన గళం, నూతన క్రీడా బిల్లు ద్వారా బీసీసీఐకు భారీ ఊరట లభించింది. క్రీడా మంత్రిత్వశాఖ చేసిన సవరణల ప్రకారం బీసీసీఐ.. సమాచార హక్కు (ఆర్‌టీఐ) పరిధిలోకి రాదు. దీంతో బయట వ్యక్తులు డిమాండ్ చేసే వివరాలను వెల్లడించాల్సిన పనిలేదు. ఈ నెల 23న కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ లోక్‌సభలో ప్రవేశపెట్టిన జాతీయ క్రీడా పాలన బిల్లులోని క్లాజ్ 15(2) ప్రకారం.. ప్రభుత్వం నుంచి నిధులు, సదుపాయాలు అందుకొంటున్న జాతీయ క్రీడా సమాఖ్యలు మాత్రమే ఆర్‌టీఐ పరిధిలోకి వస్తాయని స్పష్టంగా ఉంది. అత్యంత ధనిక బోర్డుగా గుర్తింపు పొందిన బీసీసీఐ.. నిధుల కోసం ప్రభుత్వంపై ఏమాత్రం ఆధారపడదు. సొంతంగానే మైదానాలు, మౌలిక వసతులను ఏర్పాటు చేసుకొంటోంది. మిగతా సమాఖ్యల తరహాలోనే భారత బోర్డును సమాచార హక్కు పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్ కొంతకాలంగా బలంగా వినిపిస్తున్నా.. బీసీసీఐ మాత్రం ససేమిరా అంటోంది. కొత్త క్రీడా బిల్లులో ఈ సవరణ బీసీసీఐకు అనుకూలం కానుంది.


Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310